క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లోకేశ్వరం: అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మోతీరాం అన్నారు. గురువారం మండలకేంద్రం నుంచి నగర్‌తండాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ పట్టుకొని రూ.ఐదు వేల జరిమానా విధించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

లైసెన్సు రెన్యువల్ చేసుకోండి

బాసర: మేజర్ గ్రామపంచాయతీ అయిన బాసరలో ప్రతి సంవత్సరం మాదిరి వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్సులను రెన్యువల్ చేసుకొని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హోటళ్లు, దుకాణాలవారు రుసుం చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

నేడు వారసంత వేలం

కుంటాల: మండలకేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారసంత నిర్వహణకు శుక్రవారం ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి రాజబాపు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.4 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

తానూరు: మండల కేంద్రంలో ఏడాది పాటు వారసంత నిర్వహణకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వేలం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి జలంసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గినవారు రూ.10 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



పరిశీలిస్తున్న డీడీ అంబాజీ

కడెం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఐటీడీఏ డీడీ అంబాజీ అన్నారు. గురువారం రాత్రి కడెం ఎస్టీ ఆశ్రమ పాఠశాల వసతిగృహాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రత్యేక తరగతులు పరిశీలించారు. పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. సంక్షేమాధికారి రాంజీ, సీఆర్టీ స్వరూప, సిబ్బంది తదితరులు ఉన్నారు.

40 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కడెం: మండలంలోని లింగాపూర్‌లో గురువారం కుర్ర లచ్చవ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 40 మంది స్వచ్ఛందగా రక్తదానం చేశారు. గ్రామానికే చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుర్ర గంగాధర్(డబ్ల్యు)యాదవ్ తన తల్లి జ్ఞాపకార్థం ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్‌రాథోడ్, ఏఎంసీ చైర్మన్ భూషణ్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ హాజరయ్యారు.

అగ్నివీర్‌కు ఎంపిక



తల్లితో అభిలాష్

కడెం: మండలంలోని అంబారిపేట్‌కు చెందిన లత–ప్రభాకర్ దంపతుల కుమారుడు అభిలాష్ అగ్నివీర్‌గా ఎంపికయ్యాడు. పేద కుటుంబానికి చెందిన యువకుడు అగ్నివీర్‌కు ఎంపికవడంపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

'సర్వాయి'కి నివాళి



నివాళులర్పిస్తున్న గౌడ సంఘం సభ్యులు

కుభీర్: మండలకేంద్రంలోని ఎల్లమ్మ మందిరంలో గురువారం సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌడ సంఘం జిల్లా సహా కార్యదర్శి చేకూరే కనకాగౌడ్, కిష్టాగౌడ్, మహేశ్‌గౌడ్, బాలాగౌడ్, దేవేందర్‌గౌడ్ తదితరులున్నారు.

ఆలయానికి విరాళం

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన జానకి రాంరెడ్డి అనే డాక్టర్ రూ.30 వేల విలువైన ఫ్రిడ్జ్ విరాళంగా అందజేశారు. గురువారం దేవస్థానం సూపరింటెండెంట్ శివరాజ్ దాత రాంరెడ్డి కుటుంబసభ్యుల పేరిట అర్చనలు, పూజలు చేయించారు.

రేషన్ దుకాణాల తనిఖీ

బాసర: మండలకేంద్రంలోని రేషన్ దుకాణాలను స్పెషల్ ఆఫీసర్ బీవీ.రమణ స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం తనిఖీ చేశారు. లబ్ధిదారులకు అందుతున్న సరుకుల రికార్డులు పరిశీలించారు. సన్నబియ్యం పంపిణీపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని డీలర్లకు సూచించారు.

పడిపోయిన టమాటా ధర

- కూలీ ఖర్చులూ రావడం లేదంటున్న కర్షకులు
- 15రోజుల కిందట 20 కిలోల బాక్స్ రూ.200
- ప్రస్తుతం రూ.120కి మించని వైనం
- రైతులకు అందేది కిలోకు రూ.5



అమ్మకానికి సిద్ధంగా టమాటాల బాక్స్‌లు



రాయపూర్‌కాండ్లీలో టమాటా సాగు

లోకేశ్వరం: టమాటా ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో పంట సాగు చేసిన రైతులు నిరాశ చెందుతున్నారు. గతేడాది టమాటా ధరలు ఆకాశాన్నంటడంతో ఈ సీజన్‌లో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ఇప్పుడేమో ధరలు పడిపోవడంతో కూలీ ఖర్చులు కూడా రావడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పరిస్థితి దిగుజారుతోందని.. 15రోజుల కిందట 20 కిలోల బాక్స్ ధర రూ.200 పలుకగా.. ఇప్పుడేమో రూ.120 కి మించడం లేదని పేర్కొంటున్నారు.

కిలోకు రూ.10 కంటే తక్కువే..

కాత ప్రారంభంలో మంచి ధర పలికినా క్రమేణా ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకప్పుడు మంచి ధర పలికినా ప్రస్తుతం కిలోకు రూ.10 కంటే తక్కువే పలుకుతోంది. దీంతో కొందరు రైతులు టమాటాలను తెంపకుండా చేన్లలోనే వదిలేస్తున్నారు. లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో బోరుబావుల కింద సుమారు 100 ఎకరాల్లో టమాట సాగు చేశారు. మండలంలో మొహళ, నగర్, బాగాపూర్, కిష్టాపూర్, రాయపూర్‌కాండ్లీ, సేవాలాల్‌తండా, మన్మద్, పోట్‌పల్లి, సాథ్‌గాం తదితర గ్రామాల్లో రైతులు టమాట సాగు చేశారు. ఎకరాకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. రెండు రోజులుగా ధర పూర్తిగా తగ్గుముఖం పట్టిందని..పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని కొందరు వాపోతున్నారు.

లాభపడుతున్న వ్యాపారులు..

క్షేత్రస్థాయిలో పంట సాగు చేసే రైతులకు కిలోకు రూ.5 మాత్రమే అందుతోంది. నిజామాబాద్, నాందేడ్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. ఈసారి ఆశించినంత వర్షాల్లేక వరి, పసుపు, సోయా, కంది పంటలు దెబ్బతిన్నాయి. దీనికి కరెంట్ కోతలు అదనం. ప్రభుత్వం స్పందించి టమాటా రైతులు ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



కిలో టమాటా ధర రూ.పదికి పడిపోయింది. నెల రోజుల కిందట రూ.50కి అమ్ముకున్నాం. అప్పులు చేసి పంట సాగు చేస్తే ఏం మిగుల్తలేదు. కూరగాయలు సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.
– ప్రియాంక, రైతు, నగర్‌తండా

'రజతోత్సవ సభ విజయవంతం చేయండి'



భైంసాటౌన్ : కేసీఆర్‌తో బీఆర్ఎస్ నేతలు

భైంసాటౌన్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సూచించినట్లు నియోజకవర్గ నాయకులు తెలిపారు. గురువారం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పార్టీ నాయకులు, ఇన్‌చార్జుల తో నిర్వహించిన సమావేశంలో ముధోల్ నుంచి విలాస్ గాదేవార్, పి రమాదేవి, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమ్రేవార్ పాల్గొన్నారు. కార్యకర్తలు తరలిరావాలని కేసీఆర్ సూచించినట్లు వారు తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన జాన్సన్‌నాయక్

ఖానాపూర్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను గురువారం ఎర్రవెల్లిలో ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ కలిశారు. ఈ నెల 27న వరంగల్ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభపై జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. అంతకుముందు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో కలిసి దొడ్డి కొమురయ్య జయంతిలో పాల్గొన్నారు.

ప్రారంభమైన శ్రీరామనవమి వేడుకలు



రేవోజీపేటలో పుట్టబంగారం తీసుకొస్తున్న భక్తులు



సప్తాహంలో సభ్యులతో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. డప్పుచప్పుళ్లతో అటవీప్రాంతం వెళ్లి సేకరించిన పుట్టబంగారం(మట్టి)ను ఆలయానికి తీసుకొచ్చారు. ఈ పుట్టమన్నుతో అంకురార్పణ నిర్వహించనున్నట్లు అర్చకులు వంశీధారాచార్యులు తెలిపారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతి, గౌరీ కలశపూజ, పూర్ణాభిషేకం నిర్వహించారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

భైంసారూరల్: మండలంలోని కామోల్‌లో శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సీతారామచంద్రమూర్తులను దర్శించుకున్నారు. అనంతరంలో ఆలయంలో కొనసాగుతున్న సప్తాహంలో పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా ఉండాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి పనులకు సంబంధిత అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలు పరిష్కరించాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులను ప్రభుత్వ పథకాలకు ఎంపిక చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్, వైస్‌చైర్మన్ మాజిద్, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెంబి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం పెంబి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తాగునీరు, విద్యుత్, ప్రభుత్వ పథకాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తున్నామని.. ఎవరూ దళారులకు డబ్బులిచ్చి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఇందులో తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

దొడ్డి కొమురయ్య జయంతి



ఖానాపూర్‌లో పూలమాల వేస్తున్న నాయకులు

కుంటాల: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య జయంతిని గురువారం మండలంలోని అంబకంటిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. సంఘ సభ్యులు శ్రీనివాస్, రమేశ్, సాయి, రాకేశ్, ముత్యం, పోతన్న, మల్లన్న పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని తర్లపాడ్, కొత్తపేట్ గ్రామాల్లో కుర్మ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి నిర్వహించారు. జక్కుల భూమన్న, నంది రామయ్య, బైరి రాజన్న, పెద్ది రాజన్న, పెద్ది రమేశ్, జంగం రమేశ్, పెద్ది నర్సయ్య, బీరయ్య, నర్సయ్య, మల్లయ్య, గంగమల్లు, రాజన్న తదితరులు ఉన్నారు.

'8న ప్రజాధర్నా జయప్రదం చేయండి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

భైంసాటౌన్: ఛత్తీస్‌గఢ్‌లో చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ ఈనెల 8న హైదరాబాద్‌లో చేపట్టే ప్రజాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ప్రజాధర్నా కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి జె.రాజు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీ జాతి హననానికి బీజేపీ ప్రభుత్వం తెగబడుతోందని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ పేరిట వందలాది మంది అమాయకుల ప్రాణాలు హరిస్తున్నారని వాపోయారు. ప్రజలు ధర్నాకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో భైంసా డివిజన్ కార్యదర్శి ఎం.హరిత, నాయకులు దీనాజీ, విఠల్, గంగాధర్, గంగారాం, బాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టా మార్పిడిపై విచారణ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో సర్వే నంబర్ 233/2లోని రెండెకరాల వీడీసీ భూమి పట్టా మార్పిడిపై విచారణ చేసి బాధ్యులైన గతంలో పని చేసిన తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని వీడీసీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తిమ్మాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ భూమి విషయమై హైకోర్టులో కేసు ఉన్నప్పటికీ గతంలో పనిచేసిన తహసీల్దార్ నిబంధనలకు విరుద్ధంగా భూ కబ్జాకు సహకరించారని ఆరోపించారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేసి పట్టా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్ష, కార్యదర్శులు బీసీ.రాజన్న, ద్యావత్ రాజేశ్వర్, గౌరవ అధ్యక్షుడు అంకం రాజేందర్, ఉపాధ్యక్షుడు పరాంకుశం శ్రీనివాస్, కోశాధికారి కరిపె శ్రీనివాస్, నాయకులు వెంకటప్పయ్య, వెంకాగౌడ్, బక్కశెట్టి లక్ష్మణ్, కొత్తపెల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకే జైబాపు, జై భీమ్, జైసంవిధాన్

- మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



పాదయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు యత్నిస్తోందని.. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ జైబాపు..జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రాంనగర్‌లో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్, గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ రాజ్యాంగాన్ని రక్షించుకుందామని ప్రతిజ్ఞ చేయించారు. పాదయాత్రలో కరపత్రాలను పంపిణీ చేసి రాజ్యాంగ పీఠిక ప్రదర్శించారు. ఖానాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజారాం సత్యం, పార్టీ నిర్మల్ పట్టణ అధ్యక్షులు నందేడపు చిన్ను, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జూనైద్ మేమూన్, ముడుసు సత్యనారాయణ, ధర్మాజీ రాజేందర్, రామలింగం, వాజిత్‌ఖాన్, రమణారెడ్డి, రఘు, పాకాల రాంచందర్, గజేందర్, నాగశాలి రాజేందర్, ఆకుల రామకృష్ణ, అన్వర్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ ఫలాలు..

లోకేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అంది దేశం అభివృద్ధి చెందిందని ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని భాగాపూర్ గ్రామంలో జైబాపు.. జై భీమ్.. జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గడ్డం సుదర్శన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి రామేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సమరసింహారెడ్డి, షఫీ, రత్నాకర్‌రావు, నాయకులు ఉన్నారు.

నిర్మల్: నర్సాపూర్ (జి) మండలంలోని కుస్లీ, అంజనీతండాలో నిర్వహించిన జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ లో కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం మండల అధ్యక్షుడు ఉమామహేశ్వర్, మాజీ ఎంపీటీసీ భోజన్న, నారాయణ, భోజన్న పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లిలో జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, లింగారెడ్డి, రమేశ్, సీరాజ్, అజార్, ప్రతాప్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్, నచ్చన్‌ఎల్లాపూర్, నర్సాపూర్, మాసాయిపేట్, సారంగపూర్, గ్రామాల్లో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ జిల్లా కోఆర్డినేటర్ రాంభూపాల్ మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, మండల ఇన్‌చార్జి బాపన్న, మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, శ్రీనివాస్, నారాయణ, జలజ, గంగన్న, లచ్చన్న తదితరులున్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని మంజులాపూర్‌లో జై బాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు నందెడపు చిన్ను, కార్యక్రమ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంభూపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, నిర్మల్ కార్యక్రమ ఇన్‌చార్జి రాజురా సత్యం, సేవాదళ్ రాష్ట్ర నాయకులు ఎంబడి రాజేశ్వర్, మాజీ కౌన్సిలర్లు నల్లూరి పోశెట్టి, దర్శనం సాయన్న, నేరెళ్ల వేణు, ఎస్పీ రాజు, సాయిండ్ల శ్రీధర్, కత్తి నరేందర్, గంగోని బురాజ్, కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని కంకెట, తాండ్ర(జి), వైకుంఠాపూర్ గ్రామాల్లో జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి , న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాదీ, డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

నిర్మల్‌రూరల్: నిర్మల్‌రూరల్ మండలంలోని ముజ్గి, కౌట్ల(కె) గ్రామాల్లో జైబాపు.. జై భీమ్, జై సంవిధాన్ నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు బొజ్జరాం పటేల్, కుంట వేణుగోపాల్ మల్లేశ్, కొమ్ముల రవి, బద్దం లింగారెడ్డి, మహేందర్, రాంరెడ్డి, పద్మాకర్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు నివాళి



శివాజీ విగ్రహం వద్ద గ్రామస్తులు



లక్ష్మణచాందలో నివాళులర్పిస్తున్న నాయకులు

లోకేశ్వరం: ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతి పురస్కరించుకొని మండలంలోని హథ్‌గాం గ్రామంలో గురువారం విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ ప్రకాశ్, నాయకులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, సయ్యద్ సిరాజుద్దీన్, భూమన్న, నారాయణ, ప్రతాప్‌రెడ్డి, రంజిత్, వినేశ్, నాగేశ్, రవి పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

లక్ష్మణచాంద: ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో నీడ, తాగునీరు, మెడికల్ కిట్లు వంటి కనీస వసతులు కల్పించాలని ఎంపీడీవో రాధ.. సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఉపాధి పనులను ఎంపీడీవో పరిశీలించి మాట్లాడారు. ఎఫ్ఏ ఆశన్న ఉన్నారు.

పొదుపు అలవర్చుకోవాలి

దస్తురాబాద్: ప్రతిఒక్కరూ పొదుపు చేయడం అలవర్చుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ అన్నారు. మండలంలోని బుట్టాపూర్‌లో గురువారం ఉపాధి కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల వివరించారు. ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

సీసీ కెమెరా పట్టిచ్చింది!

- బంగారు బ్రాస్లెట్‌ను అప్పగించిన సిబ్బంది
- బాసర ఆలయంలో ఘటన



బంగారు బ్రాస్లెట్ అప్పగిస్తున్న ఆలయ సిబ్బంది

బాసర: శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఓ భక్తుడు పోగొట్టుకున్న బంగారు ఆభరణాన్ని ఆలయ సిబ్బంది సీసీ కెమెరాల ఫుటేజీతో పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంకు చెందిన కృష్ణంరాజు.. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి బాసరలో కుమారుడికి అక్షరాభ్యాసం చేయించాడు. అమ్మవారిని దర్శించుకుని బయటికి వెళ్తుండగా చేతికి ఉన్న రెండున్నర తులాల బంగారు బ్రాస్లెట్ పోగొట్టుకున్నాడు. చుట్టుపక్కల వెతికినా దొరకలేదు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న సీసీటీవీ ఆపరేటర్ సాయిలు, హోంగార్డు ఇన్‌చార్జులు సురేశ్, గణేశ్ సీసీటీవీ ఫుటేజీని గమనించారు. మరో భక్తుడు బ్రాస్లెట్ తీసుకున్నట్లు గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బ్రాస్లెట్‌ను కృష్ణంరాజుకు అప్పగించారు.

నేరాలపై అవగాహన పెంచుకోవాలి

సారంగపూర్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలో సాంఘీక సంక్షేమ బాలికల గురుకులం విద్యార్థులు స్టడీటూర్‌లో భాగంగా గురువారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఎస్సై శ్రీకాంత్ సైబర్ నేరాలు, పోలీసుల విధులు, తదితర అంశాల గురించి వివరించారు. ఓటీపీలను అపరిచితులకు చెప్పవద్దని.. ఆకతాయిలు వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సిబ్బంది, గురుకులం ప్రిన్సిపాల్ సంగీత తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: బాలశక్తిలో భాగంగా మండలంలోని రాచాపూర్ ఎంజేపీ విద్యార్థులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్, తపాలా, బ్యాంకు కార్యాలయాలను సందర్శించారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది సేవలను ఎస్సై వివరించారు. అనంతరం బ్యాంకుకి తీసుకెళ్లి ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధానం, తీసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాజు, ఎస్సై అశోక్, తపాలా కార్యాలయ, బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయులు నాగరాజు, నర్సయ్య, శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ

కడెం: పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్ అన్నారు.గురువారం మండలంలోని కొండుకూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రెంకల శ్రీనివాస్, సత్తెన్న, శ్రీనివాస్, లచ్చన్న, నరేశ్, గంగరాజం, డీలర్ షరిపొద్దీన్ తదితరులున్నారు.

లోకేశ్వరం: లబ్ధిదారులకు సన్నబియ్యంను సక్రమంగా పంపిణీ చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖాధికారి రాజ నర్సయ్య అన్నారు. గురువారం మండలంలోని బాగాపూర్, గడ్‌చాంద, లోకేశ్వరం గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మండల ప్రత్యేకాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణపనులను వేగవంతం చేసి నాణ్యతతో చేపట్టాలని పేర్కొన్నారు. ఎంపీడీవో వెంకటరమేశ్, సోలమాన్‌రాజ్ ఉన్నారు.